నేడు బెంగళూరుకు ఏపీ డీసీఎం పవన్‌కల్యాణ్



బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గురువారం బెంగళూరుకు వస్తున్నారు. డీసీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. కర్ణాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రెతో కలసి ఒక కార్యక్రమంలో పాల్గొంటారు. రెండు రాష్ట్రాల కు సంబంధించిన అంశాలపై చర్చిస్తారు. విజయవాడ నుంచి బయల్దేరే పవన్ కల్యాణ్ నేరుగా బెంగళూరుకు వస్తారు. అటవీశాఖ మంత్రితో చర్చల అనంతరం ఆయన కార్యక్రమాల వివరాలు ఇంకా ఖరారు కాలేదు.



మెడికల్ టేపు ఫ్యాక్టరీలో ఘోర అగ్నిప్రమాదం




మృతి చెందిన యువకుడు యల్లప్ప


లిఫ్ట్‌లో ఇరుక్కున్న యువకుడి శవాన్ని బయటకు తీసే ప్రయత్నంలో సహాక సిబ్బంది

కార్మికుడు అంటే అంత చులకనా...?

బెళగావి జిల్లా నావగె గ్రామంలో ఉన్న టేపు తయారీ చేసే ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదంలో యల్లప్ప అనే కార్మికుడు దుర్మరణం చెందాడు. అగ్నికీలల్లో చిక్కుకుని కాలి బూడిదైన కార్మికుడి శరీర భాగాలను ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి చేతిసంచిలో వేసి తండ్రికిచ్చి ఇంటికి పంపిన ఘటన స్థానికులను కలచి వేసింది. ఉన్నతాధికారి మృతి చెంది ఉంటే ఇలాగే చేసేవారా..? అంటూ మృతుడి కన్నతండ్రి ఆవేదన చూసిన వారికి గుండె తరుక్కుపోయింది. ఫ్యాక్టరీలో లిఫ్ట్‌లో చిక్కుకున్న అగ్నికీలల్లో చిక్కుకుని కాలిపోయిన యువకుని మాంసం ముద్దలు, మిగిలిన ఎముకలను సంచిలో వేసి ఇవ్వడంపై ఘటనా స్థలానికి చేరుకున్న ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనే అంబులెన్స్ ఉన్నా మృతుడి శరీర భాగాలను చేతిసంచిలో వేసి తండ్రిచేతిలో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సణ్ణగౌడకు ఉన్న నలుగురు పిల్లల్లో యల్లప్ప ఒకరు. మిగిలిన ముగ్గురు ఆడపిల్లలు. పీయూసీ ముగిసిన తరువాత యల్లప్ప తండ్రి కష్టాన్ని చూసి చదువును మధ్యలోనే ఆపేసి ఫ్యాక్టరీలో పనికి చేరాడు. పనిలో చేరి మూడు నెలలు కాకుండానే కొడుకు ఘోరంగా మృతి చెందడంతో తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలింది. కుటుంబానికి తోడుగా ఉంటాడనుకున్న కొడుకు అకాల మరణంతో వారు శోక సంద్రంలో మునిగిపోయారు.


ఎక్స్‌కవేటర్లతో శిథిలాల తొలగింపు, యల్లప్ప మృతదేహాన్ని వెలికి తీస్తున్న సిబ్బంది

లిఫ్ట్‌లో చిక్కుకుని కాలిబూడిదైన కార్మికుడు

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రాణాలతో బయటపడ్డ 152మంది కార్మికులు..

16 గంటల పాటు సహాయక చర్యలు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 7: మెడికల్ టేపు తయారు చేసే ఫ్యాక్టరీలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో 152 మంది ప్రాణాలతో బతికి బయట పడగా యల్లప్ప(20) అనే కార్మికుడు మంటల్లో చిక్కుకుని కాలి బూడిదయ్యాడు. ఈ ఘటనలో కోట్లాది రూపాయలు ఆస్తినష్టం సంభవించినట్లు తెలుస్తోంది. బెళగావి నగర సమీపంలోని సవగా గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం స్నేహం టెక్స్ మెడికల్ టేప్ తయారీ ఫ్యాక్టరీలో జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగా కొన్ని నిమిషాల్లోనే మంటలు వ్యాపించాయి. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న 152 మంది కార్మికులు ప్రాణాలతో బతికి బయట పడగా... ఒక కార్మికుడు మాత్రం మంటల్లో చిక్కుకుపోయాడు. నారాయణ, కర్వేకర, దశరథ పాటిల్ అనే ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని బెళగావిలోని కేఎల్ఈ ఆసుపత్రిలో చేర్పి చికిత్సలు అందిస్తున్నారు. వీరి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరికొంత మంది కార్మికులు కూడా గాయపడ్డారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో జిల్లా పాలనా మండలి ఆధ్వర్యంలో సహాక చర్యలు చేపట్టారు. మంగళశారం రాత్రి అంతా బెళగామ్ జిల్లాధికారి మహ్మద్ రోషన్, నగర పోలీసు కమిషనర్ యడా మార్టిన్ ఘటనా స్థలంలో మకాం వేసి సహాయక చర్యలు పర్యవేక్షించారు. ఈ సహాయక చర్యలు బుధవారం సాయంత్రం వరకు కొనసాగాయి. సుమారు 16 గంటల పాటు సహాయక చర్యలు కొనసాగించారు. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుడు యల్లప్ప ఉన్న ప్రాంతాన్ని గుర్తించిన సహాయక బృందాలు కాలిబూడిదైన శరీర బాగాలను బయటకు తీసి ఘటనా స్థలంలోనే పంచనామా చేశారు. అనంతరం ఎముకలను డీఎన్ఏ టెస్ట్‌కు పంపించారు. మంటల్లో కాలిపోయిన శరీర భాగాలు, ఎముకలను ముద్దను చేతి సంచిలో వేసి తండ్రి చేతికి ఇచ్చారు. కొడుకు మాంసం ముద్దలు వేసిన సంచిని చేతిలో పట్టుకుని బోరున విలపిస్తుండడం చూసిన వారి మనసు కలిచివేసింది.


కొడుకు అస్తికలను చేతి సంచిలో తీసుకెళుతున్న తండ్రి సణ్ణగౌడ, సంఘటనా స్థలం వద్ద విషన్న వదనంలో...



కేంద్రానికి తొత్తుగా గవర్నర్

రాష్ట్ర హోంశాఖ మంత్రి పరమేశ్వర్ ఆగ్రహం

బళ్లారి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ కేంద్రానికి తొత్తుగా వ్యవరిస్తున్నారని, ముడా కేసులో ఈడీ ఏమీ అడగకుండానే ఆయన అత్యుత్సాహం చూపి కేంద్రం మెప్పు పొందుతున్నారని రాష్ట్ర హోంశాఖ మంత్రి పరమేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విజయనగరలో నూతనంగా నిర్మించిన పరేడ్ గ్రౌండ్, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వే ఫోర్స్ కార్యాలయం, పోలీస్ క్వార్టర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)లో జరిగిన స్థలాల వ్యవహారంపై రిటైర్డు జస్టిస్ పీఎస్ దేశాయ్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. తమ భూమికి బదులు భూమి ఇవ్వాలని కోరారు. భూములివ్వాలని సిద్దరామయ్య అడిగారని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు లేవా అని ప్రశ్నించారు. రాజకీయ కారణాలతో పాదయాత్ర చేయడం బీజేపీ దురుద్దేశం ఏమిటో తెలిసిపోతోందన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న పాదయాత్ర వల్ల సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం లేదని, ఆరోపణల్లో వాస్తవం లేదని పరమేశ్వర్ అన్నారు. ముఖ్యమంత్రిపై విచారణకు గవర్నర్ అనుమతిస్తే న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.


పోలీస్ క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న పరమేశ్వర్

వయనాడ్ బాధితులకు కెనరాబ్యాంకు రూ.కోటి సాయం


కేరళ ముఖ్యమంత్రికి చెక్కు అందజేత

బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం వయనాడ్‌లో జరిగిన ఘోర దుర్ఘటనకు కెనరాబ్యాంకు స్పందించింది. ఈ మేరకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్‌కింద కోటి రూపాయలను విరాళంగా ఇచ్చారు. కెనరాబ్యాంకు ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణరాజు మాట్లాడుతూ కేరళ వరద బాధితులకు తమ వంతు సాయం అందించేందుకు కట్టుబడ్డామని ప్రకటించారు. ఈ మేరకు తిరువనంతపురం బ్యాంకు జనరల్ మేనేజర్ ప్రదీప్ కేఎస్ స్వయంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలసి కోటి రూపాయల చెక్కు అందచేశారు.

ఏడీజీపీ అలోక్‌కుమార్‌పై కేసు కొట్టివేత



బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి చేశారనే నమోదైన కేసు నుంచి లా అండ్ ఆర్డర్ ఏడీజీపీ అలోక్‌కుమార్ విముక్తులయ్యారు. మమతా సింగ్ అనే మహిళ 2022లో ఎలక్ట్రానిక్‌సిటీ పోలీస్ స్టేషన్‌లో కుమార్తెపై సమీప బంధువు లైంగికంగా వేధించాడని ఫిర్యాదు చేశారు. ఇదే కేసు విషయమై అధికారి అలోక్‌కుమార్‌ను భేటీ కాగా సీరియస్‌గా పరిగణించలేదని, మహిళా పోలీసుల చేత దాడి చేయించారని ఆరోపిస్తూ కోర్టులో కేసు దాఖలు చేశారు. ఈ మేరకు అధికారి అలోక్‌కుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. దీనిపై అలోక్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా విచారణ జరిపిన నాగప్రసన్న ఏకసభ్య ధర్మాసనం మంగళవారం కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. అలోక్‌కుమార్ తరఫున సీనియర్ న్యాయవాది ప్రభులింగ నావదగి వాదనలు వినిపించారు. ఫిర్యాదురాలు మహిళా మమతాసింగ్ బీజేపీ నేత యడియూరప్పపై లైంగిక ఆరోపణలు చేసినవారే, ఆమె ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.

సిద్దూకు క్లీన్‌చిట్ లేదు

ముడాలో 14 ఇంటి స్థలాలు ఎలా తీసుకున్నారు..?

మండిపడ్డ ప్రతిపక్షనేత అశోక్

మండ్యలో పంచెకట్టులో పాదయాత్ర

బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని, క్లీన్ చిట్ అంటూ చెప్పుకునే ముఖ్యమంత్రి సిద్దరామయ్య ముడాలో ఏకంగా 14 ఇంటి స్థలాలు ఎలా పొందారని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. బుధవారం మండ్యలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సిద్దరామయ్య ఎప్పుడూ క్లీన్‌చిట్ కాదన్నారు. కెంపణ్ణ కమిషన్‌కు ఆరు నెలల గడువు ఇచ్చారని, ఆరేళ్లయినా ఎందుకు పూర్తి కాలేదని, మరో 60 ఏళ్లు అయినా అది తేల్చరని అన్నారు. ముడా అవినీతిపై దేశాయ్ కమిషన్‌కు ఎన్ని నెలలు గడువు ఇచ్చారని, ఈలోగా నివేదిక సాధ్యమేనా అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు క్లీన్‌చిట్ ఇవ్వాలని మీకు మీరుగా చెప్పుకోవడం కాదన్నారు. ముడా అవినీతికి సంబంధించి పలు రికార్డులను విడుదల చేశారు. 27 మంది భాగస్వాములు ఉంటే కేవలం ఒకరి పేరిట ఖాతా ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇది ఓ మూలన ఉండే స్థలమని సిద్దరామయ్య చెబుతున్నా విజయనగరలో మధ్యభాగంలో ఉందన్నారు. పాదయాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, కేంద్ర మంత్రి కుమారస్వామి తదితరులు పంచెకట్టు, రైతు కండువాలతో ముందుకుసాగారు.


పంచెకట్టులో కుమారస్వామి, విజయేంద్ర

ఉడుపిలోనే అత్యధిక వర్షం

రెండు నెలల్లో 3,427 మి.మీ. నమోదు

24 శాతం అధికం


గతవారం బైందూరు తాలూకాలో జలమయమైన ఇల్లు

బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 31 జిల్లాల్లో దాదాపు రెండు నెలలుగా వర్ష బీభత్సం కొనసాగుతోంది. ప్రత్యేకించి ఉడుపి జిల్లాలో జూన్, జూలై నెలల్లో 3,427 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇది జిల్లాలో అత్యధిక వర్షపాతం. జూలైలో సాధారణంగా 1448 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా ఈ ఏడాది 2,049 మి.మీ. వర్షం కురిసింది. సాధారణం కంటే 24 శాతం అధికంగా నమోదయింది. దీంతో పలు గ్రామాలు జలావృతమయ్యాయి. పాఠశాలలు, పాత ఇళ్లు నేలకూలాయి. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ కూలిన ఇళ్లను పరిశీలించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. దక్షిణకన్నడలో సాధారణంగా 2,347 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 2,819 మి.మీ., కొడగులో 1513 మి.మీ.కిగాను 1844 మి.మీ., శివమొగ్గలో 1,356 మి.మీ. కురవాల్సి ఉండగా 1686 మి.మీ., ఉత్తరకన్నడలో 1835 మి.మీలకుగాను 2,679 మి.మీ. వర్షం కురిసింది. సాధారణం కంటే ఉడుపి జిల్లాలో 24శాతం, దక్షిణకన్నడలో 20, కొడగులో 22, శివమొగ్గలో 24 శాతం అధికంగా నమోదైంది. ఉత్తరకన్నడ జిల్లాలో ఏకంగా 46 శాతం అత్యధిక వర్షం నమోదైంది. చిత్రదుర్గ జిల్లాలో అత్యంత తక్కువగా 146 మి.మీ. వర్షం కురిసింది. జిల్లాలో సాధారణం 119 మి.మీ. కాగా ఇక్కడ కూడా 23 శాతం అధికంగా నమోదైంది. ఇక రాయచూరు జిల్లాలో 189 మి.మీ. వర్షంతో 3 శాతం కొరత కాగా, యాదగిరిలో 219 మి.మీ. వర్షం కురిసి 10శాతం కొరత ఏర్పడింది. వర్షం తక్కువగా కురిసినా సరిహద్దు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, ప్రాజెక్టుల నుంచి వరద పోటెత్తింది. బాగల్కోటెలో మి.మీ., రాయచూరులో 189మి.మీ. బెళగావి 589 మి.మీ. వర్షం కురిసింది.


ఇటీవల కార్కళ తాలూకాలో ఇలా..



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.50	1,627.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	67,394	12,582
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	50,302	7,976
సామర్థ్యం (టీఎంసీలు)	103.78	85.54

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి



ఠాగూర్‌కు నివాళులర్పిస్తున్న రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, ఆగస్టు 7: రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు బుధవారం సంజీవరాయనకోట పాఠశాలలో ఘన నివాళులర్పించారు. మొదట ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కర్ణాటక రాష్ట్ర క్రియాశీలశిక్షణ వేదిక అధ్యక్షుడు రవి చెళ్లగుర్కి మాట్లాడుతూ.. ఠాగూర్ విశ్వకవి అని, 83వ వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవాలన్నారు. ఇంగ్లీషు కవులైన వర్డ్స్ వర్త్, కీట్స్, విలియం షేక్స్పియర్‌లా భారతదేశంలో ఠాగూర్ రాసిన జనగణమన గీతం ప్రపంచానికి ఆదర్శంగా మారిందన్నారు. ఆయన రచించిన గీతాంజలి నవలకు 1913లో నోబెల్ అవార్డు లభించిందనీ, వారు స్థాపించిన శాంతినికేతన్ పాఠశాల విశ్వభారతి విశ్వవిద్యాలయం అయిందన్నారు. నేటి విద్యార్థులు ఆయన ఆదర్శగుణాలను అలవర్చుకోవాలన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు దిల్షాద్‌బేగం, చన్నమ్మ, సుమతి, వైశాలి, శ్వేత, ఉమ్మెహాని, శశమ్మ, రామాంజినేయ, గురుప్రసాద్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, ఆగస్టు 7: గెలుపు ఓటములను సరిసమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజ తెలిపారు. బుధవారం సిరుగుప్ప పట్టణం హైస్కూలు గ్రౌండ్‌లో పీయుసీ విద్యార్థులకు క్రీడాపోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ, క్రీడాపోటీల వలన మనిషికి ఉల్లాసం, ఉత్సాహం కలుగుతాయని తెలిపారు. వీటి వలన ఆరోగ్యం చేకూరుతుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, చెన్నప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖుల జయంతి ఏర్పాట్లపై సమావేశం

బళ్లారి సిటీ, ఆగస్టు 7: ప్రముఖుల జయంతి ఏర్పాట్లపై శనివారం ముందస్తు సమావేశం ఏర్పాటుచేసినట్లు కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 19న చందయ్య జయంతి, 20న బ్రహ్మశ్రీ నారాయణగురు జయంతి, 26న శ్రీకృష్ణజయంతి వేడుకలను పురస్కరించుకుని నూతన జిల్లాపరిపాలనా సభాంగణంలో అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేరా అధ్యక్షతన జరిగే సమావేశంలో ఏర్పాట్లపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

విడపనకల్లు, ఆగస్టు 7: మండలంలోని గడేకల్లు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. విడపనకల్లు పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బళ్లారికి చెందిన హేమంత్ భార్య జానకమ్మ, కొడుకు తిరుమలతో కలిసి ప్రొద్దుటూరుకు కారులో బుధవారం మధ్యాహ్నం బయలు దేరారు. గడేకల్లు వద్దకు రాగానే ఎదురుగా బొగ్గులోడుతో వస్తున్న లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో కారులో ఉన్న హేమంత్‌కు, ఆయన భార్య జానకమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కొడుకు తిరుమలకు స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. స్థానికులు క్షతగాత్రులను కారులోంచి బయటికి తీసి బళ్లారి ఆసుపత్రికి తరలించారు.



తీరనున్న ప్రజల పానీ పాట్లు

- రూ.308 కోట్లతో విజయనగర గ్రామాలకు తుంగభద్ర నీరు
- హోస్పేట ప్రజల తాగునీటి కష్టాలకు ఇక ఫుల్‌స్టాప్

బళ్లారి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఇంటిముందర చెరువుఉన్నా, తాగడానికి మాత్రం నీళ్లు లేని పరిస్థితి హోస్పేట నగర ప్రజలది. వారికి సమీపంలోనే టీబీ డ్యాం ఉన్నా నగరానికి తాగునీటి సరఫరాలో అన్నీ అడ్డంకులే. వాటినన్నంటినీ అధిగమిస్తూ ఇంతకాలం తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిల్లా ప్రజల కోసం అధికారులు కొత్త నీటిప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.308 కోట్ల కర్ణాటక మైనింగ్ ఎన్విరాన్‌మెంట్ రిహాబిలిటేషన్ కార్పొరేషన్ (కేఎంఇఆర్‌సీ) నిధులతో ఈ నీటి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రణాళిక రచించారు.

ఇందుకోసం తుంగభద్ర జలాశయంలోని డెడ్ స్టోరేజీ నీటిని వినియోగించుకుంటారు. పావగడ ప్రాజెక్టు దగ్గర ప్రత్యేక జాక్వెల్ నిర్మించి, టీబీ డ్యాం రెండో ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద కొండపైన భారీ ట్యాంకు నిర్మిస్తారు. అక్కడే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అక్కడ నుండి నగరంలోని అన్ని ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించారు. గతంలో ఈ నీటిప్రాజెక్టు రిపోర్టును కేఎంఇఆర్‌సీకి పంపారు. మొత్తం వ్యయం రూ. 308.93 కోట్లలో 80శాతం అంటే రూ. 250 కోట్లు మంజూరు అవుతుందని అంచనా వేశారు. మిగిలిన 20 శాతం నిధులు ప్రజా విరాళాల ద్వారా సేకరించాలని భావించారు. అవేవీ లేకుండానే వంద శాతం కేఎంఇఆర్‌సీ నిధులతో ఈ నీటి ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇందుకు సంబంధించి ఆదేశాలు అందగానే మరి కొన్నిరోజుల్లో టెండర్లు కూడా పిలవనున్నారు.

హోస్పేట్ నగరంలో ప్రస్తుతం 2.91 లక్షల జనాభా ఉంది. 2055 నాటికి జనాభా 5.50 లక్షలకు పెరుగుతుందని అంచనా వేశారు. వాటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రణాళిక రూపొందించారు. టీబీ డ్యాం సమీపంలోని కొండపై 10 ఎకరాల రెవెన్యూ భూమి ఉంది. ఇక్కడ ట్యాంక్, నీటి శుద్ధీకరణ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించారు. ఇక్కడ నుంచి ట్యాంకులకు పంపింగ్ లేకుండానే నీరు సాఫీగా ప్రవహిస్తుంది. అందుకే ఎత్తుగా ఉండే ఈ ప్రాంతాన్ని ఎన్నుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇంటింటికీ నీరు సరఫరా అవుతుందని అధికారులు తెలిపారు. మొత్తం మీద రూ. 308 కోట్లతో నిర్మాణం చేపట్టే ఈ నీటి ట్యాంకు వల్ల భవిష్యత్తులో విజయనగర జిల్లాలోని మెజారిటీ గ్రామాలకు తాగునీటి ఇబ్బంది ఉండదని విజయనగర డీసీ ఎంఎస్ దివాకర్ తెలిపారు.

సమాజహితం కోసమే పరిశోధనలు

ప్రొఫెసర్ సంతోష్‌నాయక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంతోష్‌నాయక్

బళ్లారి సిటీ, ఆగస్టు 7: సమాజ శ్రేయస్సు కోసమే శాస్త్రీయ పరిశోధనలు అవసరమని కర్ణాటక ఓపెన్ యూనివర్శిటీ సోషియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సంతోష్‌నాయక్ అన్నారు. కన్నడ విశ్వవిద్యాలయంలో సామాజిక పరిశోధన ప్రస్తుత పరిస్థితి అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశాలు తమ జ్ఞానశక్తి ద్వారా ప్రపంచాన్ని శాసిస్తున్నాయన్నారు. సామాజిక పరిశోధన అనేది మానవ ప్రవర్తనను అర్థంచేసుకోవడానికి ప్రయత్నించే విధానమని, తద్వారా సమాజంలోని అనేక సమస్యలకు పరిష్కారాలను కనుగొనవచ్చునన్నారు. ముఖ్యంగా మెరుగైన సమాజం నిర్మించబడాలంటే, సామాజిక పరిశోధన నిరంతరం జరగాలన్నారు. గిరిజన అధ్యయన విభాగాధిపతి ప్రభాకర్ మాట్లాడుతూ.. కన్నడ విశ్వవిద్యాలయం గిరిజన అధ్యయన విభాగం ఇప్పటికీ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా 12గిరిజన పురాణాలను ప్రవేశపెట్టిందని, కన్నడ విశ్వవిద్యాలయం ప్రచురించిన అనేక పుస్తకాలు విదేశీ విశ్వవిద్యాలయాల గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, ఇది దేశానికే గర్వకారణమన్నారు. ఈసందర్భంగా ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఆగస్టు 7: గ్రామాల్లో వుండే ప్రభుత్వాస్పత్రి సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. కురుగోడు తాలుకా పరిధిలోని ఓర్వాయి గ్రామంలో బుధవారంరూ. 4 కోట్లతో నిర్మించిన నూతన ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా



ఓర్వాయి గ్రామంలో ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ హయాంలో ప్రభుత్వాస్పత్రులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆలయాలు ఎన్నో ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే కంప్లి, కురుగోడులో వంద పడకల ఆస్పత్రి కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఎంతో విలువ చేసే ఆరు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వాస్పత్రి కోసం ఈశ్వరగౌడ విరాళంగా ఇవ్వడం చారిత్రాత్మకమైన విషయమన్నారు. ఇప్పట్లో రెండు సెంట్లు కూడా ఇవ్వని కాలంలో ఏకంగా ఆరు ఎకరాలు విరాళంగా ఇచ్చారన్నారు. ప్రతి ఒక్కరు తమ సంపాదనలో కాస్తయినా సమాజ అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో సదుపాయాలు ఎన్నోవున్నాయని, అన్ని వ్యాధులకు అవసరమైన చికిత్సలు అందించే వైద్యులు వున్నారన్నారు. మున్ముందు మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు జడెమ్మ, ఉపాధ్యక్షురాలు సువర్ణ, డీహెచ్‌వో సురేష్ బాబు, గాదెలింగప్ప, లక్ష్మన్న, పీడీవో తిమ్మప్ప, అమరేష్, క్రిష్ణప్ప, సోమేష్‌పంపాపతి, పాల్గొన్నారు.

టీబీ శానిటోరియంలో కుక్కల స్వైరవిహారం



టీబీ శానిటోరియం వార్డుల్లో తిరుగుతున్న వీధి కుక్క

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 7: దగ్గు, ఆయాసం వ్యాధితో చికిత్స పొందుతున్న రోగుల టీబీ శానిటోరియం వార్డుల్లో కుక్కలు తిరుగుతున్నాయి. దీంతో రోగులు ఆందోళన పడుతున్నారు. చికిత్స పొందుతున్న వారిని బయట వాతావరణానికి దూరంగా ఉంచాలని వైద్యులు చెబుతున్నా, వీధి కుక్కలు ఏకంగా ఆసుపత్రిలోకే ప్రవేశిస్తుండడం ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారింది. ఆసుపత్రిలో సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణ సరిగాలేని కారణంగానే తరచూ కుక్కలు నేరుగా వార్డుల్లోకి ప్రవేశిస్తున్నట్లు రోగులు చెబుతున్నారు. ఈ విషయం డాక్టర్ల దృష్టికి వెళ్ళినా పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. వార్డుల్లో తాము భోజనం చేస్తున్న సమయంలో కుక్కలు లోనికి రావడం పట్ల రోగులు ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా కృషివిజ్ఞాన కేంద్రం గోల్డెన్ జూబ్లీ



హగరి కృషి విజ్ఞాన కేంద్రం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో ప్రముఖులు

బళ్లారిరూరల్, ఆగస్టు 7: తాలుకాలోని హగరి కృషి విజ్ఞాన కేంద్రం గోల్డెన్ జూబ్లీ (50వ వార్షికోత్సవం) సందర్భంగా బుధవారం తాలుకాలోని పరమ దేవనహళ్లి గ్రామ పంచాయతీ నుంచి కృషి విజ్ఞాన కేంద్రం వరకు జ్యోతిని డప్పు మంగళవాయిద్యాలతో ఎద్దులబండి మీద పెద్దఎత్తున ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన సూపరింటెండెంట్ రవి శంకర్, కేవీకే అధికారి రవి కుమార్, డాక్టర్ రమేష్, బీకే డాక్టర్ డీకే ఆదిముని, డాక్టర్ గిరీష్, డాక్టర్ హనుమంతప్ప, డాక్టర్ పాలయ్య, రాజేశ్వరి, విద్యార్థులు పలుగ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మైసూరు పాదయాత్రకు బళ్లారి ప్రముఖులు



పాదయాత్రకు బయలు దేరుతున్న బీజేపీ ప్రముఖులు

బళ్లారి సిటీ, ఆగస్టు 7: ముడా కుంభకోణానికి వ్యతిరేకంగా బెంగళూరు నుంచి బీజేపీ, జేడియస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రలో పాల్గొనేందుకు జిల్లానుంచి భారతీయ జనతా పార్టీ రైతు మోర్చా నాయకులు బయలు దేరి వెళ్లారు. నగరంలోని దుర్గాదేవికి పూజలు చేసిన అనంతరం వారు బయలు దేరారు. ఈసందర్భంగా జిల్లామోర్చా అధ్యక్షుడు గణపాల ఐనాథ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రైతు మోర్చా ఉపాధ్యక్షుడు శివరుద్రగౌడ, బసవరాజ్‌పాటిల్, గ్రామీణ మండల అధ్యక్షుడు హొన్నారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దమ్మూరు గ్రామపంచాయితీ మాజీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, దాసారెడ్డి, రామన్‌గౌడ, ఓబీసీ జిల్లాఉపాధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠం



మాట్లాడుతున్న భాగేవడి వైద్యాధికారి మహమ్మద్ ఖాసిం

సిరుగుప్ప, ఆగస్టు 7 : పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠమైనవని బాగేవాడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మహమ్మద్ ఖాసిమ్ తెలిపారు. బుధవారం తాలుకాలోని బాగేవాడి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు తల్లిపాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. పిల్లలు ఆరోగ్యంగా వుండాలంటే తల్లిపాలు శ్రేష్ఠమైనవని తెలిపారు. ప్రస్తుతం డెంగ్యూ వ్యాధిపై అప్రమత్తంగా వుండాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి సిబ్బంది నీలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పిల్లలు పాల్గొన్నారు.

మహిళల రక్షణపై పోస్టర్ విడుదల



మహిళల భద్రతపై పోస్టరు విడుదల చేసిన కలెక్టర్, జడ్పీ సీఈవో

బళ్లారిరూరల్, ఆగస్టు 7: జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ మాతృ మహిళా మండలి అభయ పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో శ్రీ మాతృ మండలి అధ్యక్షురాలు పుష్ప చంద్రశేఖర్ విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జెడ్పీసీఈవో రాహుల్ శరణప్ప సుంకనూరు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా మహిళల భద్రతపై పలు విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

17న తొలి త్రైమాసిక ప్రగతి సమీక్ష



జిల్లాపంచాయతీ సీఈఓ రాహుల్‌శరణప్ప

బళ్లారి సిటీ, ఆగస్టు 7: ప్రస్తుత సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌వరకు జరిగిన జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై త్రైమాసిక సమీక్షాసమావేశం ఈ నెల 17న జరపనున్నట్లు జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప తెలిపారు. ఈ సమావేశానికి గృహనిర్మాణ, వక్ఫ్, బళ్లారి ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ అధ్యక్షత వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

హోసూరు జోన్

హోసూరు ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలు



పాలు ఇచ్చి పిల్లలను పెంచుతామని ప్రమాణం చేస్తున్న తల్లులు

హోసూరు, ఆగస్టు 7: హోసూరు డెంకణీకోటరోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ జ్ఞాన మీనాక్షీ అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా ఆరాధన చారిటబుల్ వ్యవస్థాపకురాలు రాధ పాల్గొన్నారు. ఇందుల్లో ప్రభుత్వాసుపత్రిలో ప్రసవించిన 61 మంది తల్లులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శక్తివేల్, గైనకాలజిస్ట్ పార్వతీ మాట్లాడుతూ, తల్లులు తమ పిల్లలకు పాలు ఇస్తున్నప్పుడు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతుందని తెలిపారు. కళాశాల విద్యార్థులకు తల్లిపాలపై వ్యాసరచన, కవితల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం అందరూ ప్రమాణం చేశారు. అనంతరం చైల్డ్ హెల్త్ డాక్టర్ శక్తివేల్ మాట్లాడుతూ హోసూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళ 750 గ్రాముల శిశువుకు జన్మనిచ్చిందని అయినా వైద్యులు, నర్సులు, వెంటిలేటర్‌పై ఉంచి రక్షించారన్నారు. ఇప్పుడు పాప బరువు 3 కిలోలకు పెరగడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇందుకు కారణం తల్లిపాలేనన్నారు. చెప్పినట్టుగానే అక్కడ ఉన్న తల్లిని బిడ్డను అందరికి పరిచయం చేశారు. అలాగే ప్రభుత్వాసుపత్రిలో ఇలా పనిచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

హోసూరు, ఆగస్టు 7: హోసూరులోని ప్రభుత్వ ఎయిడెడ్ సెయింట్ జాన్‌బాస్కో బాలికల హయ్యర్ సెకండరీ పాఠశాలలో బుధవారం వార్షిక క్రీడోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా తమిళనాడు పోలీసు మాజీ డీజీపి వాల్టర్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా పాఠశాలకు చేరుకున్న ఆయనకు పాఠశాల ప్రిన్సిపాల్ ఏంజెలాతో పాటు పోలీసు ఉన్నతాధికారులు, నిర్వాహకులు ఉత్సాహంగా స్వాగతం పలికారు. అనంతరం ఒలింపిక్ జ్యోతిని వెలిగించారు. అనంతరం శాంతి పావురాలను ఎగురవేస్తూ ఆటలను ప్రారంభించారు. ఇందులో పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 12 వ తరగతి వరకు విద్యార్థులు నృత్యంతో పాటు పలు కళాత్మక కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమం అనంతరం వాల్టర్ దేవరాం మీడియాతో మాట్లాడుతూ ఒలింపిక్స్ చూడటం కష్టం కాదన్నారు. వెనుకబడిన కులం నుంచి వచ్చిన వారి పిల్లలకు విద్యను అందించడమే కాకుండా జిల్లా, రాష్ట్ర జాతీయ, ప్రపంచ స్థాయి కామన్వెల్త్ ఒలింపిక్ పోటీల్లో గెలుపొందాలంటే క్రీడల్లో రాణించడం చాలా ముఖ్యమన్నారు. ఈ పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల పిల్లలు తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు.



హోసూరు జాన్‌బాస్కో పాఠశాల వార్షిక క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

మామిడి చెరువులో మొసలి పట్టివేత



మొసలిని పట్టుకున్న అటవీ శాఖ అధికారులు

రాయచూరు, ఆగస్టు7: చారిత్రక ప్రసిద్ధిచెందిన నగరంలోని మామిడి చెరువులో మొసలి కనిపించడంతో బుధవారం స్థానికులు కలవరం చెందారు. చుట్టుపక్కల ఇళ్ల వారు మొసలి చెరువులో కనిపించడంతో వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది మొసలి గురించి స్థానికులను అడిగి తెలుసుకుని వెంటనే బోట్ ద్వార చెరువులోకి దిగి మొసలిని బంధించారు. అనంతరం దాన్ని అక్కడి నుంచి అటవీ ప్రాంతానికి తరలించారు. దీంతో ఇరుగుపొరుగు ఇళ్ల వారు హమయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

మహిళా డ్రైవర్లకు వేతనాలు వెంటనే చెల్లించాలి



ప్రగతి పరిశీలన సభలో మాట్లాడుతున్న జడ్పీ ఉపకార్యదర్శి శశికాంత్ శివపురె

రాయచూరు, ఆగస్టు 7: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఘనవ్యర్థాలను తరలించే వాహనాలకు డ్రైవర్లుగా పని చేస్తున్న మహిళలకు వెంటనే వేతనాలు చెల్లించాలని జడ్పీ ఉపకార్యదర్శి శశికాంత్ శివపురె ఆదేశించారు. డ్రైవర్ల వేతనాలు, గ్రామ పంచాయతీల్లో సమస్యలు ఇతర అంశాలకు సంబంధించి బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో ఆయన ప్రగతి పరిశీలన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడిన ఉప కార్యదర్శి జిల్లా వ్యాప్తంగా వివిధ తాలూకాల్లో ఎంతమంది పని చేస్తున్నారు? వారిలో శిక్షణపొందిన మహిళాడ్రైవర్ల సంఖ్య ఎంత? తదితర వాటి గురించి వివరాలను సేకరించారు. బాకీ ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.

కృష్ణా నీటి కోసం పోరాటం

సీపీఎం నేత డాక్టర్ అనిల్‌కుమార్ అవులప్ప పిలుపు

బాగేపల్లి, ఆగస్టు 7: పోరాటాల కేంద్రమైన బాగేపల్లిలో కృష్ణా నది నీటి వాటాలు సాధించేందుకు మళ్లీ పోరాటానికి సన్నద్ధం కావాలని సీపీఎం నేత డాక్టర్ అనిల్‌కుమార్ అవులప్ప పిలుపునిచ్చారు. పట్టణంలోని బీసీ హాస్టల్ సమీపాన స్థూపం వద్ద బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో 44వ దివంగత నేతలను స్మరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ 1980 ఆగస్టు 7న నరగుంద, నవలగుంద రైతుల పోరాటంలో బాగేపల్లి నుంచి మద్దతుగా పాల్గొన్నారన్నారు. అయితే పోలీసుల కాల్పులలో తాలూకాకు చెందిన దద్దీమప్ప, ఆదినారాయనరెడ్డిలు అశువులు బాశారని గుర్తు చేశారు. అప్పటినుంచి ఏటా వారి స్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాగా గ్రామీణ ప్రాంతాలలో సీపీఎం పట్ల అభిమానం ఉందని వారిని సిద్ధాంతపరంగా బలోపేతం చేసి పార్టీని పటిష్టం చేయాలన్నారు. కాగా వెనుకబడిన ప్రాంతమైన తాలూకాలో శాశ్వతనీటి వనరులు లేవంటూనే కృష్ణ నది నీరు వృథాగా సముద్రం పాలవుతోందని సద్వినియోగం చేసుకునేలా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2025 నాటికి కృష్ణనది నీటివాటాలకోసం పోరాటాన్ని బలోపేతం చేద్దామన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో చైతన్యగీతాలు ఆలపించారు. పురవీధులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిద్దగంగప్ప, సీపీఎం జిల్లా కార్యదర్శి ముని వెంకటప్ప, తాలూకా కార్యదర్శి రఘురామరెడ్డి, ఓబళరాజు, చన్నరాయప్ప, అశ్వత్థప్ప, రామాంజి, బిళ్ళూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



స్మారకస్థూపం వద్ద సీపీఎం నేతలు, కార్యకర్తలు

కన్నడజ్యోతి రథానికి ఘన స్వాగతం



రథం స్వాగతంలో పాల్గొన్న ప్రముఖులు తదితరులు

దొడ్డబళ్ళాపుర, ఆగస్టు 7: మైసూరు రాష్ట్రానికి కర్ణాటకగా మరునామకరణం చేసి 50ఏళ్ల పూర్తైన సందర్భంగా 'హెసరాయితు కర్ణాటక ఉసిరాగలి కన్నడ' నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా కన్నడ జ్యోతి రథం సంచరిస్తోంది. ఇందులో భాగంగా దేవనహళ్ళి తాలూకా నుంచి బుధవారం దొడ్డబళ్ళాపుర తాలూకాకు చేరుకోవడంతో తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు పీ గోవిందరాజు నేతృత్వంలో ఘనంగా స్వాగతించారు. 1956 నవంబరు 1న మైసూరు రాష్ట్రంగా పేరు చేశారు. 1973లో నవంబరున కర్ణాటకగా పునఃనామకరణం చేశారు. కర్ణాటక ఏకీకరణ పోరాటంలో అశువులు బాసిన బళ్ళారి రంజాన్‌సాబ్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కన్నడ సంఘాల ముఖ్యులు కన్నడ పక్ష రాష్ట్ర అధ్యక్షుడు సంజీవనాయక్, కరవే ప్రధాన కార్యదర్శి రాజఘట్టె రవి, కసాప తాజా మాజీ అధ్యక్షురాలు ప్రమీళా మహాదేవ్, కరవే రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు. చరిత్రను, సాహిత్యాన్ని, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలని అభిప్రాయపడ్డారు. నగర సభ కమిషనర్ కార్తిక్ ఈశ్వర్, నగరసభ స్థాయి సమితి అధ్యక్షుడు రవికుమార్, నగరసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కేసీపీ సర్కిల్‌నుంచి కొంగాడియప్ప హైస్కూల్, రంగప్ప సర్కిల్, అరళుమల్లిగె బాగిలుమీదుగా రథం ఊరేగింపు సాగింది. కళాబృందాల సందడి ఆకట్టుకుంది.

బ్రిగేడ్ ద్వారా బీసీఐసీ నైపుణ్య కేంద్రం

బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బ్రిగేడ్ ఫౌండేషన్, బెంగళూరు చాంబర్ ఆఫ్ ఇండస్ట్రి అండ్ కామర్స్ (బీసీఐసీ) సంయుక్తంగా వివిధ విభాగాలలో నైపుణ్యత కల్పించేందుకు స్కిల్ డెవలెప్‌మెంట్ అకాడమీని బుధవారం ప్రారంభించింది. బ్రిగేడ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎంఆర్ జయశంకర్ మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, సామాజికవర్గం అభివృద్ధి కోసం బ్రిగేడ్ ఫౌండేషన్ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నిర్మాణ, హాస్పిటాలిటీ, టూరిజం, ప్రొడక్షన్, రిటైల్, విభాగాలలో 11 లక్షల నిపుణుల కొరత ఉందన్నారు. యువతకు అకాడమీ ద్వారా నైపుణ్య శిక్షణలు అందించదలిచామన్నారు. బీసీఐసీ చైర్మన్ వినీత్‌వర్మ మాట్లాడుతూ 880మందికిపైగా సభ్యులు కల్గిన మా సంస్థ ద్వారా రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వదలిచామన్నారు. అందుకే నైపుణ్యత కీలకమని భావించి యువతకు పరి శ్రమలకు అవసరమైన మానవ వనరులను తీర్చదలిచామన్నారు.



స్కిల్ డెవలెప్‌మెంట్ అకాడమీ ప్రారంభంలో ప్రముఖులు

డిజిటల్ పరికరాల పంపిణీ



కంప్యూటర్ ఉపకరణాల పంపిణీలో లైబ్రేరియన్ శంకరప్ప తదతరులు

చిక్కబళ్ళాపుర, ఆగస్టు 7: జిల్లాలో 12-25 ఏళ్లలోపు యువతులకు డిజిటల్ స్కిల్స్ నేర్పించే లక్ష్యంగా గ్రామ డిజి అభివృద్ధి కార్యక్రమాన్ని జిల్లా లైబ్రేరియన్ శంకరప్ప నేతృత్వంలో డిజిటల్ పరికరాలు పంపిణీ చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధ వారం ఏర్పాటైన కార్యక్రమంలో డెల్ మాని టర్, సీపీయూలను, 3 గ్రామ పంచాయతీ లైబ్రరీలకు స్మార్ట్ ఫోన్‌లను పంపిణీ చేశారు. చిక్కబళ్లాపుర జిల్లాలో ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా 92 గ్రామ పంచాయతీ లైబ్రరీలలో గ్రామ డిజి అభివృద్ధి కార్యక్రమం అమలవుతోందన్నారు. తాలూకాలో గత ఏడాది 92 లైబ్రరీలకు స్మార్ట్ టీవీ, ఆండ్రాయిడ్ ఫోన్‌లు, ఇంటర్నెట్ క్రోమ్ బుక్ డెల్ బోర్డులను అందచేశారన్నారు. ఈ ఏడాది కొత్తగా 3 గ్రామ పంచాయతీ లకు ఇచ్చామన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం బాగేపల్లి, చింతామణి గ్రంథాలయాలకు మానిటర్‌లు, సీపీయూ, స్మార్ట్‌ఫోన్‌లు ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శశికళ, ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ రవికుమార్, జిల్లా గ్రంథాలయ పర్యవేక్షకుల సంఘం జిల్లా అధ్యక్షుడు అశ్వథ్, తాలూకా గ్రంథాలయ పర్యవేక్షకులు బాగేపల్లి వెంకటరమణ నాయక్, చింతామణి కమలమ్మ పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌లో మహ్మద్ హసనైన్‌కు బంగారు బహుమతి

బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శివమొగ్గలో ఏటుజడ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మహ్మద్ హసనైన్‌కు బంగారు బహుమతి దక్కింది. దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు నేపాల్, భూటాన్, దుబాయ్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లనుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. బెంగళూరు నగరం బాల్డ్‌విన్ బాయ్స్ స్కూల్‌లో చదువుతున్న హసనైన్ ఉత్తమ ప్రదర్శనకు బంగారు బహుమతితోపాటు రూ.25వేల చెక్కు అందించారు. రాష్ట్రంలో అతిచిన్న క్రీడాకారుడిగా గుర్తింపు పొందారు. అఖిల కర్ణాటక స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరుణ్ మాచయ్య, ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రెడ్డి, నిర్వాహకులు డాక్టర్ శిహాన్, ముజీబ్, గ్రాండ్‌మాస్టర్ హంశి ప్రవీణ్ రంకాలు పాల్గొన్నారు. బాల్డ్‌విన్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ లీనా డేనియల్ ప్రత్యేకంగా అభినందించారు.

దక్షిణాదిన గౌతమ్ సోలార్ విస్తరణ

బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణభారత్‌లో గౌతమ్ సోలార్ సంస్థ సేవలను విస్తరింపచేయదలిచినట్టు సీఈఓ గౌతమ్ మోహన్ వెల్లడించారు. బెంగళూరులో కొత్త గోడౌన్‌లను సాంకేతిక పరిజ్ఞానంతో సిద్ధం చేశామన్నారు. ఆర్థిక స్థిరత్వం, వృద్ధిలో గౌతమ్ సోలార్ ప్రాధాన్యత ఇవ్వనుందన్నారు. 27ఏళ్లపాటు దేశ వ్యాప్తంగా సేవలందిస్తున్నామని ఉత్తరాఖండ్, హర్యానాలలో ఫ్యాక్టరీలు ఉన్నాయన్నారు. ఢిల్లీ ప్రధాన కేంద్రంగా దేశమంతటా సేవలు కొనసాగించదలిచినట్టు తెలిపారు. బెంగళూరులో తొలి గోడౌన్ ప్రారంభించడం ద్వారా దక్షిణాదిన అడుగు పెట్టామన్నారు. ఇటీవల విడుదల చేసిన టాప్‌కాన్ సోలార్ మాడ్యుల్‌లకు రాష్ట్రంలో ప్రాజెక్టు డెవలెపర్‌లు, ఎపిక్ ఈపీసీ కంపెనీలు, సిస్టమ్ ఇంటిగ్రేటర్‌ల సహకారంతో సేవలు విస్తరింపచేస్తామన్నారు.

జనాందోళనకు తరలిన కార్యకర్తలు

శిడ్లఘట్ట, ఆగస్టు 7: చన్నపట్టణలో సాగుతున్న జనాందోళన సమావేశానికి కాంగ్రెస్ నేత పుట్టు ఆంజినప్ప నేతృత్వంలో వందలాది కార్యకర్తలు బుధవారం తరలారు. శిడ్లఘట్ట, బ్యాటరాయనపుర నియోజకవర్గాలనుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు వాహనాల్లో బయల్దేరారు. ఈ సందర్భంగా ఆంజినప్ప మాట్లాడుతూ గవర్నర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని అస్థిర పరిచే ప్రతిపక్షాల కుట్రకు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. ప్రజల సొమ్మును లూటీ చేసిన వారి గురించి ప్రజలకు తెలియచేసేలా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జనాందోళన కార్యక్రమం చేపట్టారన్నారు.



బస్టాండ్‌లో ఆంజినప్ప నేతృత్వంలో కార్యకర్తలు

చేనేత పరిశ్రమ కుదేలు

- పదేళ్లలో 22వేల మంది వృత్తికి దూరం
- ప్రభుత్వాల ఆదరణ కరువు



బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాల తయారీకి అవసరమైన సిల్క్, పట్టు పురుగుల పెంపకం ద్వారానే సాధ్యమవుతుంది. దేశంలోనే పట్టు పురుగుల పెంపకం, పట్టుగూళ్ల విక్రయం, చరఖాల ద్వారా సిల్క్ ఉత్పత్తి వంటి అన్ని విభాగాల్లోనూ కీలకమైన రాష్ట్రంలోనే ఏటా చేనేత పరిశ్రమ కుదేలవుతోంది. అందుకు ఎన్నో కారణాలు ఉన్నాయి. పట్టు చీరల తయారు చేసే చేనేత కార్మికులకు తగిన కూలి గిట్టుబాటు కాకపోవడం, మరమగ్గాలు ఎక్కువ కావడం, ముడి సరుకు ధరలు పెరగడం వంటివి కీలకంగా ఉన్నాయి. రాష్ట్రంలో చేనేత పరిశ్రమ పట్ల ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఏకంగా పదేళ్ల వ్యవధిలో 22వేల మందికిపైగా కార్మికులు చేనేత వృత్తికి దూరమయ్యారు. దేశంలో పట్టు వస్త్రాల తయారీలో 15 శాతం రాష్ట్రంలోనే ఉన్నాయి. వీటిలో 29,377 చేతి మగ్గాల ద్వారా పట్టుచీరలు, నూలు బట్టలు, ఇళకల్ చీరలు, టవల్, లుంగీ, బెడ్‌షీట్‌లను తయారు చేస్తారు. రాష్ట్రంలో బెంగళూరు గ్రామీణ, బాగల్కోటె, ఉడుపి, చిత్రదుర్గ జిల్లాల్లో అత్యధికంగా చేనేత పరిశ్రమ ఉంది. వీటిలో కొందరు చేతి మగ్గాల ద్వారా జీవనం సాగిస్తున్నారు. 2009-10లో జాతీయ చేనేత మగ్గాల గణాంకాల ప్రకారం 76,849 మంది ఉండేవారు. 2019-20 నాటికి 54,791 మందికి తగ్గారు. ప్రస్తుతం పవర్‌లూమ్స్ వంటివి పెరగడంతో చేనేత మగ్గాల మనుగడ కష్టతరమవుతోంది. కేవలం ప్రత్యేక డిజైన్లను మాత్రమే నేస్తున్నారు. చేనేత కార్మికుల మనుగడ కోసం సమ్మాన్ యోజన, చేతి మగ్గాల వికాస యోజన, జియోగ్రాఫికల్ ఇండికేషన్ వంటి అనేక పథకాలు ఉన్నాయి.

చేనేతలకు ఎన్నెన్నో సవాళ్లు

చేతి మగ్గాలను పరిశీలిస్తే పవర్‌లూమ్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది. చేనేత మగ్గంలో చీర తయారు చేయాలంటే రెండు మూడు రోజుల సమయం పడుతుంది, పైగా ఆదాయం కూడా ఆశించినంతగా ఉండదు. రంగులతోపాటు ముడి సరుకు వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. నైపుణ్యం కల్గిన చేనేత కార్మికులు సైతం గిట్టుబాటు కాక వృత్తులను క్రమేపీ వదులుకుంటున్నారు. యువతరం పవర్‌లూమ్స్ పట్ల ఆసక్తి చూపుతున్నారు. రోజంతా పనిచేస్తే ఎక్కువ ఆదాయం సాధ్యమవుతోంది. దీంతో అన్ని విధాలా చేనేత కార్మికులకు నష్టం కలిగిస్తోంది. 2015 నుంచి ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పాటిస్తున్నారు. చేనేత కార్మి కులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని భావిస్తున్నారు.



విధానసౌధలో చేనేత మగ్గం పనితీరును పరిశీలిస్తున్న సభాపతి హొరట్టి, మంత్రి శివానంద పాటిల్

జీఐ ట్యాగ్ వ్యవస్థ

చేనేత మగ్గాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎన్నో విధాలా ప్రయత్నిస్తోంది. అందుకోసమే ప్రభుత్వం జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్‌ను ఇస్తున్నారు. ఇందులో ఇళకల్ చీరలు, గుళేదగుడ్డ వస్త్రాలు, మొళకాల్మూరు పట్టుచీరలు, ఉడుపి కాటన్ చీరలు వంటి నాలుగు ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ చట్టాన్ని అమలు చేస్తున్నారు. సదరు ప్రదేశాలలో అన్ని ఉత్పత్తులకు గుర్తింపు లభించేలా చేశారు. 2022-24 సంవత్సరంలో 44,406 మంది చేనేత కార్మికులకు నేకార సమ్మాన్ యోజనె కింద రూ. 22.20 కోట్లు ఆర్థికంగా వెసులుబాటు కల్పించారు. చేనేత కార్మికులు మనుగడ సాధించాలంటే ప్రభుత్వం మరిన్ని రాయితీలతో ముడిసరుకు సమకూర్చడంతోపాటు సౌలభ్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.


విధానసౌధలో ఆకట్టుకున్న ప్రదర్శన

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని విధానసౌధలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. పరిషత్ సభాపతి బసవ రాజ హొరట్టి, మంత్రి శివానందపాటిల్ సహా అధికారులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో ప్రజలు, విధానసౌధ ఉద్యోగులు సందర్శించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి (జయంతి)



జంట కవులలో ఒకరైన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి 1870 ఆగస్టు 8న తూర్పు గోదావరి జిల్లా కడియంలో జన్మించారు. తెలుగు కవి, అవధాని, నాటకకర్త. తెలుగు సాహిత్యంలో దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి తిరుపతి వేంకటకవులు గాను, జంట కవులుగాను పేరొందారు. వీరిద్దరూ ఇంచు మించుగా వంద సంస్కృత, తెలుగు గ్రంథాలు, నాటకాలు, అనువాదాలు రాశారు. అవధానాల్లో వీరి పాండి త్యం, ప్రతిభ, చమత్కార చాతుర్యం సాహితీ సమాజంలో తరతరాలుగా చెప్పుకొనబడుతున్నాయి. పాండ వోద్యోగ విజయములు నాటకంలోని పద్యాలు ఊరూరా మారుమోగాయి. కళాప్రపూర్ణ పురస్కారం అందు కున్నారు. 1950లో కన్నుమూశారు.

జీన్ డీచ్ (జయంతి)



యూజీన్ మెర్రిల్ డీచ్ 1924 ఆగస్టు 8న అమెరికా దేశం చికాగోలో జన్మించారు. ఆస్కార్ అవార్డు పొందిన ఇల్లుస్ట్రేటర్‌గా, యానిమేటర్‌గా, కామిక్ ఆర్టిస్ట్ గానే కాక సినీ దర్శకుడిగా రాణించారు. మున్రో, టామ్ టెర్రిఫిక్, నుడ్నిక్, పొపెయ్, టామ్ అండ్ జెర్రీ సిరీస్ ఎంతో పేరుతెచ్చాయి. టెర్రి టూన్స్‌లో క్రియేటివ్ డైరెక్టర్‌గా సిడ్నీ ది ఎలిఫెంట్, గ్యాస్టన్ లి క్రేయాన్, టామ్ టెర్రిఫిక్, క్లింట్ రాబర్ క్యారెక్టర్‌లను సృష్టించారు. ఇవి అకాడమీ అవార్డుకు నామినేట్ అయ్యాయి. 2020 ఏప్రిల్ 16న కన్నుమూశారు. 2021లో 'టామ్ అండ్ జెర్రీ' సినిమా ఆయన జ్ఞాపకార్థం అంకితం చేయబడింది.

కపిల్ సిబల్ (పుట్టినరోజు)



కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలలో ఒకరైన కపిల్ సిబల్ 1948 ఆగస్టు 8న పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జన్మించారు. కేంద్రంలో యూపీఏ హయాంలో కేంద్రమంత్రిగా వివిధ హోదాలలో కొనసాగారు. వృత్తిరీత్యా న్యాయవాది కావడంతో న్యాయశాఖ, ఐటి కమ్యూనికేషన్స్, మానవ వనరుల విభాగాల మంత్రిగా వ్యవహరించారు. 1998లో రాజ్య సభ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాలోనూ, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూడుసార్లు వ్యవహరించారు. 2022లో రాజ్యసభకు నామినేట్ అయ్యారు. కాగా సాహిత్యంపై ఆసక్తితో కొన్ని హిందీ సినిమాలకు పాటలు రాశారు.

రోజర్ ఫెదరెర్ (పుట్టినరోజు)



స్విస్ దేశానికి చెందిన టెన్నిస్ క్రీడాకారుడు రోజర్ ఫెదరర్ 1981 ఆగస్టు 8న జన్మించారు. ప్రపంచ స్థాయిలో అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ)చే పురుషుల సింగిల్స్‌లో 9వ ర్యాంకులో నిలిచారు. 20 గ్రాండ్‌స్లామ్ సింగిల్ టైటిల్స్‌ను సాధించిన మూడో వ్యక్తి. డబుల్స్‌లో ఇంతవరకు 8 టైటిల్స్ సాధించారు. స్టెఫాన్ ఎడ్‌బర్గ్ స్పోర్ట్స్‌మన్ షిప్ అవార్డు 13సార్లు అందుకోగా బీబీసీ ఓవర్సీస్ స్పోర్ట్స్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్‌ను నాలుగుసార్లు సాధించారు. 310 వారాలపాటు వరల్డ్ నెంబరు వన్‌గా కొనసాగడం విశేషం. అత్యధిక ఆదాయం కల్గిన అథ్లెట్‌లో ఒకరిగా ఉన్న ఆయన సేవాకార్యక్రమాలతో మానవతా వాదిగాను గుర్తింపు పొందారు. లేవర్ కప్ తర్వాత 2022 సెప్టెంబరులో టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు.

మీరాబాయి చాను (పుట్టినరోజు)



జాతీయస్థాయిలో వెయిట్‌లిఫ్టర్‌గా పేరొందిన సైఖోమ్ మీరాబాయి చాను 1994 ఆగస్టు 8న మణిపుర రాష్ట్రం ఇంఫాల్ తూర్పు ప్రాంతంలో జన్మించారు. 2014 కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 48 కిలోల విభాగంలో రజత పతకం సాధించారు. టోక్యో 2020 సమ్మర్ ఒలింపిక్స్‌లో రజత పత కం సాధించారు. ఒలింపిక్స్‌లో 115 కిలోల క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో తనదైన రికార్డుల నెలకొల్పారు. కరణం మల్లీశ్వరి తర్వాత ఒలింపిక్ పతకం సాధించిన రెండో మహిళగా రికార్డు నమోదు చేశారు. 2018లో రాజీవ్ ఖేల్‌రత్న, 2019లో 'పద్మశ్రీ' అందుకున్నారు. 2022 కామన్వెల్త్ పోటీల్లో మొత్తం 201 కిలోలు ఎత్తడం ద్వారా బంగారు పతకం సాధించారు. ప్రస్తుతం 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 49కేజీల విభాగంలో పాల్గొన్నారు.

లారీ ఢీకొని గర్భిణి మృతి

ప్రాణం కోల్పోయిన గర్భస్థ శిశువు



సించన (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివారు నెలమంగల వద్ద బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డ ప్రమాదం హృదయ విదారకం అనిపించింది. టిప్పర్ లారీ, ద్విచక్ర వాహనానంపై వెడుతున్నవారిని ఢీకొంది. 8 నెలల గర్భిణీ కింద పడిపోయింది. లారీ ఆమెపై దూసుకుపోవడంతో పసికందు బయటపడి విలవిలలాడి మృతి చెందింది. స్థానికులు పరుగెత్తిరాగా అప్పటికే డ్రైవర్ పరారీ అయ్యాడు. ఎడేహళ్ళి గ్రామానికి చెందిన సించనకు మరో పదిరోజుల్లో 9వ నెలకు గర్భానికి చేరనుంది. భర్త మంజునాథ్‌తో కలసి సమీపంలోని ఓ ఆలయం నుంచి వాపసు వస్తుం డగా గ్రామానికి సమీపంలోనే టిప్పర్ లారీ ద్విచక్ర వాహనంపైకి దూసుకొచ్చింది. అంతలోనే సించన (30)పై లారీ వెళ్లడంతో కడుపులోనుంచి బిడ్డ బయట పడింది. కాసేపు కదలాడిన బిడ్డ ఆ వెంటనే కన్ను మూసింది. కాగా ప్రమాదంలో భర్త మంజునాథ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. నెలమంగల ట్రాఫిక్ పోలీ సులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కొడుకును చంపాడని... దారుణంగా హత్య చేసిన తండ్రి

బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో హత్యలు, రౌడీల ఆగడాలు పెరుగుతున్నాయి. నరసింహన్ కుమారుడు గణేశ్‌ను ఇటీవల హత మార్చారు. ఈ దారుణం వెనుక అజిత్ కారకుడని పోలీసులు గుర్తించి రౌడీషీట్ ఓపెన్ చేశారు. కొన్ని రోజులపాటు జైలులో గడిపిన అజిత్ ఇటీవలే విడుదలయ్యాడు. గణేశ్ కుటుంబంపై అనుచితంగా మాట్లాడుతుండడంతో అజిత్ తీరును తట్టుకోలేకపోయారు. ఈనెల 1న సాయంత్రం శేషాద్రిపురం రసల్దార్ వీధిలో రౌడీషీటర్ అజిత్‌ను వెంటాడి దారుణంగా హత్యచేశారు. ఈకేసులో గణేశ్ తండ్రి నరసింహన్ (48), అరుణ్ (28), అజయ్ (28), ప్రకాశ్ (30)లను అరెస్టు చేశారు. ఈ కేసులో ఇద్దరు మహిళలను విచారణ జరిపామని శేషాద్రిపురం పోలీసులు తెలిపారు. కుమారుడు గణేశ్‌ను హత్య చేసినప్పటి నుంచి కక్షతో ఉన్న నరసింహన్ తన సన్నిహితులతో కలసి కుట్ర పన్నాడు.

15న బ్లాక్‌డేకు ప్రైవేట్ పాఠశాలల పిలుపు

బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యాసంస్థలను నిబంధనల పేరిట హింసిస్తున్నాయన 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రోజున బ్లాక్ డే జరుపుతామని ప్రైవేట్ విద్యాసంస్థల సంఘాలు ప్రకటించాయి. బుధవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో క్యామ్స్, కుస్మా, కుంసా, మాస్ తదితర సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. ఈసందర్భంగా క్యామ్స్ కార్యదర్శి శశి కుమార్ మాట్లాడుతూ పాఠశాలలకు ఫైర్ క్లియరెన్స్ సర్టిఫికెట్, బ్లూ ప్రింట్, ల్యాండ్ కన్వర్షన్‌తోపాటు పలు ప్రమాణ పత్రాలను సమర్పించాలని వేధిస్తున్నారన్నారు. కోర్టు నిబంధనలు మీరి విద్యాశాఖ వ్యవ హరిస్తోందన్నారు. విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప కనీస బాధ్యతగా వ్యవహరించడం లేదన్నారు. ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ తీరును నిరసిస్తూ ఇండిపెండెన్స్ రోజున బ్లాక్‌డేగా ఆచ రించదలిచామన్నారు. 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలను బంద్ చేస్తామని హెచ్చరించారు. శివ మొగ్గలో విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప అధి కారులతో సభ జరిపారు. వారు బ్లాక్ డే చేస్తామంటే అది వారి హక్కు అన్నారు. వారి ప్రతిపాదనలకు స్పందించామన్నారు. గురువారం బెంగళూరు లో ప్రత్యేకసభ ఏర్పాటు చేశానని, చర్చలు జరిపి నిర్ణయం తీసుకుం టామని మంత్రి వెల్లడించారు.

పునరావాస కేంద్రంలోనూ అప్పుల డిమాండ్

బెంగళూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అప్పులు వసూలు చేయాలనే తపన తప్ప అవతలివారు ఎలాంటి పరిస్థితిలో ఉన్నారనే కనికరం కూడా లేని పరిస్థితి సమాజంలో నెలకొంది. బెళగావి జిల్లాలోని పలు గ్రామాలు నీట మునగడంతో సర్వం కోల్పోయి పునరావాస కేంద్రాల్లో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని బతుకు ఈడుస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కూడా చేసిన అప్పు తీర్చాలని, మీరెక్కడ ఉన్నా తమకు ఏమి సంబంధమని అప్పులవారు వేధించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. గోకాక్‌లోని పునరావాస కేంద్రంలో సేద తీరుతున్న పలువురు మహిళల నుంచి అప్పుల వసూళ్లకు ప్రైవేట్ ఫైనాన్షియర్లు వెంటపడ్డారు. స్థానికులు, పునరావాస కేంద్రంలో సేద తీరుతున్నవారు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలు రుక్సా తుంబేవి తెలిపిన మేరకు.. ప్రైవేట్ ఫైనాన్స్‌లో వంటింటికి అవసరమైన సామగ్రికి రూ.లక్ష అప్పు చేశానని, ప్రతివారం రూ.1800 చెల్లించానని అన్నారు. మరో పదివేలు అప్పు ఉందని, ఈలోగా భారీ వర్షంతో సర్వం కోల్పోయి పునరావాస కేంద్రానికి చేరామన్నారు. ఇల్లు మునిగిందని, రెండు వారాలు గడువు ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదన్నారు. తంగవ్వ, గంగవ్వ, పార్వతి తదితరులు మాట్లాడుతూ ప్రైవేట్ ఫైనాన్స్ ఇంటి అవసరాలకు అప్పు చేశామని, కూలి పనులతోపాటు పాల విక్రయంతో వచ్చే సొమ్ముతో ప్రతి వారం చెల్లించేవారమన్నారు. ఇల్లు మునగడంతో ఇలా రోడ్డుపై పడ్డామని కొంత సమయం కోరినా వారు పట్టించుకోలేదన్నారు. విషయం తెలుసుకున్న బెళగావి జిల్లా అధికారి మహ్మద్ రోషన్ స్పందించారు. ప్రైవేట్ ఫైనాన్స్ నిర్వాహకుల తీరుపై మండిపడ్డారు. ప్రైవేట్ సంస్థలు, సంఘాలతోపాటు అప్పు కట్టాలని ఎవరు పునరావాస కేంద్రానికి వచ్చినా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రెండు నెలలపాటు ఎవరి అప్పులు అడిగేందుకు వీలు లేదని ఆదేశించారు.